తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల    కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల

సోమవారం
12 అక్టోబర్ 2026

పేజీలు : 8

Follow :



## జేఎన్టీయూ శాశ్వత క్యాంపస్
# నిర్మాణం వెంటనే చేపట్టాలి

**కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించాలి**

**సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి) రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలో నిర్వహిస్తున్న జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి,విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.2021లో రూ 402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు,సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ క్రమంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని కేటీఆర్ కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.



## పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు
# కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 275 మంది లబ్ధిదారులకు రూ. 2.75 కోట్లకు పైగా ఆర్థిక సాయం
- పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి: నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన చెక్కులు పంపిణీ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 275 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ. 2,75,31,900 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను

మిగతా 3లో

## మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

సుల్తానాబాద్,అక్టోబర్ 11(జనంసాక్షి) : మండలంలోని గర్రెపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల లో విజయం సాధించి నూతన పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన బీజేపీ సీనియర్ నాయకులు జెట్టి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి విజయంపై హర్షం వ్యక్తం చేశారు.మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధి, సభ్యుల ఆర్థిక పురోగతి లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలని ఆకాంక్షించారు. సంఘం సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.




ఐకమత్యంతో ముందుకు సాగుతూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.ఈ ఎన్నికల లో అధ్యక్షుడిగా జెట్టి సంపత్, కార్యదర్శిగా జెట్టి అనిల్, ఉపాధ్యక్షుడిగా కీర్తి మల్లయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా జెట్టి రమేష్, కుందెళ్ల శ్రీనివాస్, గీకురు శంకరయ్య, పసర్ల మురళి, కుందెళ్ల సతీష్, పిట్టల వెంకటయ్య ఎన్నికై నూతన పాలకవర్గంలో స్థానం సంపాదించారు.నూతన పాలకవర్గ సభ్యులందరూ

వార్తా లోపలి పేజీలో




# గమ్యం యాప్ లో కనిపించని బస్సు..

## గమ్యం తప్పిన ప్రయాణికులు!

- ట్రాకింగ్ లేక నరకం చూస్తున్న గన్నేరువరం ప్రయాణికులు, విద్యార్థులు!
- అరకొర బస్సులతో అవస్థలు.. తోడుగా యాప్ మొరాయింపు..
- పట్టించుకోని కరీంనగర్ డిపో అధికారులు!

గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి): గన్నేరువరం మండల ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు తిప్పలు తీరడం లేదు. ఇప్పటికే కరీంనగర్ నుండి గుండ్ల పల్లి మీదుగా గన్నేరువరం మండల కేంద్రానికి అరకొర గా బస్సులు నడుస్తుండటంతో

మిగతా 3లో

## ప్రజాస్వామ్యం ముసుగులో
# కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు

**బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులచారి**

- ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగితే ప్రతిపక్షాల గగ్గోలు ఎందుకు?
- 82 కోట్ల మంది ఓటర్లను, లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిని కాంగ్రెస్ అవమానిస్తోంది..
- బంగ్లాదేశ్, పాకిస్తాన్, రోహింగ్యాల దొంగ ఓట్లు పోతుంటే రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ లకు బాధ ఎందుకు?
- ఈసీ స్వయంప్రతిపత్తిపై మాట్లాడే అర్హత ఎన్నికల కమిషనర్లను మంత్రులుగా చేసిన కాంగ్రెస్‌కు లేదు..



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదం లో పడిందంటూ కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న నిరాధార ఆరోపణలను బీజేపీ ఇందూర్ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి తీవ్రంగా ఖండించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా దినేష్ పటేల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో ఓటర్లకు తగిన సమయం (100 నుండి 158 రోజులు అంటే 4 నుండి 5 నెలలు) కల్పించారు . కాంగ్రెస్ పార్టీ



## ట్రాన్స్‌ఫార్మర్ చోరీల
# ముఠా గుట్టురట్టు

- 19 కేసుల్లో ప్రమేయం..
- మరో అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్
- బావమరిదితో కలిసి రాగి కాయిల్స్ చోరీ
- వాహనం, పరికరాలు స్వాధీనం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి) కామారెడ్డి జిల్లాలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రాగి తీగలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన

మిగతా 3లో

# ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు

ప్రతిపక్ష పార్టీలు బతితీ మన దేశంలో ప్రజలకు అన్యాయం జరుగుతుంది ప్రజాస్వామ్యం కూలి అవుతుందని గగ్గోలు పెడుతున్నారు.దేశంలోని మొత్తం 95 కోట్ల మంది ఓటర్లలో 82 కోట్ల మంది (88%) స్వచ్ఛందంగా ఎన్యూమరేషన్ ఫారమ్ పూర్తి చేసి బాధ్యతాయుతమైన పౌరులుగా నిలిచారు. ఇంతటి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటే, 82 కోట్ల మందిని కాంగ్రెస్ అవమానిస్తోంది. తుది జాబితాలోకి రాని దాదాపు 13 కోట్ల మంది యాఆఆ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) వర్గాలకు చెందినవారు. ఇందులో 2.89 కోట్ల మంది మరణించినవారు కాగా, 1.01 కోట్ల మంది నకిలీ (డూప్లికేట్) ఓటర్లు. మిగిలినవారి ఇళ్లకు బూత్ స్థాయి అధికారులు (ఃఓూలు), రాజకీయ పార్టీల కార్యకర్తలు మూడుసార్లు వెళ్లినా వివరాలు లభ్యం కాలేదు.దేశవ్యాప్తంగా 9 లక్షలకు పైగా బూత్ లలో లో దాదాపు 11 లక్షల మంది ప్రభుత్వ అధికారులు (ఐఏఎస్, పీసీఎస్ అధికారుల నుండి ఉపాధ్యాయుల వరకు) నిష్పక్షపాతంగా పనిచేశారు.అన్ని పార్టీలకు చెందిన 35 లక్షల మంది ఃఒం-2 ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. కేవలం బీజేపీ నుంచే 9 లక్షల మంది ఃఒం-2లు ఉన్నారు. మొత్తం 46 లక్షల మంది ఉద్యోగులు, ప్రతినిధుల సమక్షంలో జరిగిన ప్రక్రియలో అన్యాయం ఎలా జరుగుతుంది?గత ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది ఫామ్-6 ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ ఎన్నికల సంఘం తొలగించలేదు.

ఇందూర్ జిల్లాలో 12 లక్షల ఓట్లు నమోదు కాగా, వివిధ సాంకేతిక పరిశీలనల నిమిత్తం 4 లక్షల మందికి నోటీసులు ఇవ్వడం జరిగింది. అందులో కేవలం 28 వేల మంది మాత్రమే ఇంకా వివరణ ఇవ్వాల్సి ఉంది.

ఢిల్లీలో ఉన్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గారు ఇందూరు జిల్లాలోని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బూత్ లెవెల్ ఆఫీసర్ (ఃఓూ)కు ఫోన్ చేసి ఆయన ఓటును తొలగించండి అని చెప్తారా కొంచెం అయినా సిగ్గుందా మహేష్ కుమార్ గౌడ్ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడానికి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంట్లో గానీ, మహేష్ కుమార్ గౌడ్ ఇంట్లో గానీ, కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఎవరిదైనా ఒక్క ఓటు పోయిందా?భారత పౌరుల ఓట్లు పోనప్పుడు, కాంగ్రెస్ ఎందుకు ధర్నాలు చేస్తోంది? ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ చొరబాటుదారుల దొంగ ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అంత బాధ?ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ కు లేదు. కాంగ్రెస్ హయాంలో ఈసీలను ఎలా రాజకీయ లబ్ధికి వాడుకున్నారో చరిత్ర చెబుతోంది. తొలి ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ (1950?58) సోదరుడు అశోక్ కుమార్ సేన్ 1957లో కాంగ్రెస్ ఎంపీగా గెలిచి నెహ్రూ కేబినెట్ లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అయ్యారు.మాజీ సీఈసీ శేషన్ పదవీ విరమణ తర్వాత 1999లో గాంధీనగర్ లో ఎల్.కె. అద్వానీ గారిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పోటీ చేసి ఎల్.కె. అద్వానీ చేతిలో ఓడిపోయారు.ఎం.ఎస్. గిల్ రిటైర్మెంట్ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి, పంజాబ్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికై, యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిగా పదవి అనుభవించారు.కేరళ మాజీ హోం మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితల గతంలో మాట్లాడుతూ సీపీఎం దొంగ ఓట్లను అరికట్టడానికి ఎస్ఐఆర్ ఎంతగానో ఉపయోగపడిందని ప్రశంసించారు.కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్వయంగా ఓటర్ల జాబితాలో నకిలీ, మరణించిన ఓటర్ల సమస్యలు ఉన్నాయని అంగీకరిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు డిజిటల్ టెక్నాలజీని వాడాలని సూచించారు. రాజస్థాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ "ఈ దేశంలో అక్రమంగా ఎవరైనా నివసిస్తుంటే వారిని తొలగించాల్సిందే" అని స్పష్టం చేశారు.నిరసనలకు వెనకుండి మద్దతిస్తున్న ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గతంలో 2015లోనే ఢిల్లీలో 11 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని ఆరోపించారు.ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధతను, పారదర్శకతను సమర్థిస్తూ 42 మంది మాజీ న్యాయమూర్తులు బహిరంగ లేఖ విడుదల చేశారు.ప్రపంచవ్యాప్తంగా భారత ఎన్నికల వ్యవస్థ పారదర్శకతను కొనియాడుతుంటే, రాహుల్ గాంధీ చేస్తున్న నిరసనలను చూసి సొంత పార్టీ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారు.2014లో ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేపట్టిన చారిత్రాత్మక సంస్కరణలు, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడమే ప్రతిపక్షాల పనిగా మారింది. గతంలో రాఫెల్ ఒప్పందంపై, ఆ తర్వాత ఈవీఎంలపై అసత్యాలు ప్రచారం చేసి బోర్లా పడ్డ కాంగ్రెస్, ఇప్పుడు ఓట్ల దొంగతనం పేరుతో ప్రజలను అయోమయానికి గురిచేసే కుట్ర చేస్తోంది. ఇలాంటి తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని దినేష్ పటేల్ స్పష్టం చేశారు.



# ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి

**తెలంగాణ సిక్కు సొసైటీ ఆరోగ్య శిబిరంలో ఎమ్మెల్యే ధన్ పాల్..**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి:**
ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే దంపాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. తెలంగాణ సిక్కు సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేదలైన సిక్కులకు ఇల్లు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతా యని చెప్పారు. అందరూ ఐక్యమత్యంతో ఉంటూ ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిక్కు సొసైటీ అధ్యక్షురాలు తేజ్ దీప్ కౌర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దర్శన్ సింగ్ సోకి, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. ట్యాంకర్‌తో పంటకు నీరు!

**పంటను కాపాడుకునేందుకు రైతు తిప్పలు**



**భీంగల్ అక్టోబర్ 11 జనంసాక్షి:**
ఎల్‌నినో ప్రభావంతో సరిపడా వర్షాలు కురవకపోవడంతో పంటను కాపాడుకునేందుకు ఓరైతు ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నాడు. భీంగల్‌పట్టణానికి చెందిన రైతు పురస్తూ నరేశ్‌కు చెందిన సుమారు ఎకరంన్నర వరి పంట వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయే దశకు చేరుకుంది. బోరుబావుల్లో నీటిమట్టం పడిపోవడం, పంటకు నీరందించడం కష్టంగా మారింది.పంట కోతకు మరో నెల రోజుల సమయం ఉండటంతో ఎలాగైనా పంటను కాపాడుకోవాలనే ఉద్దేశంతో రైతు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పొలానికి అందిస్తున్నాడు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోవడం, సాగునీటి వనరులు అడుగంటడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను కాపాడుకునేందుకు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గమ్యం యాప్ లో కనిపించని బస్సు..

ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఈ సమస్యకు తోడు ఇప్పుడు ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "గమ్యం" యాప్ కూడా మొరాయిస్తుండటంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. బస్సు ఏ సమయానికి వస్తుంది? ఎక్కడి వరకు వచ్చింది? అని తెలుసుకుందామని విద్యార్థులు, ఉద్యోగులు యాప్ ఓపెన్ చేస్తే.. బస్సు ట్రాకింగ్ కనిపించడం లేదు. దీంతో గంటల తరబడి బస్ స్టాండ్లలోనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

**విద్యార్థుల ఆవేదన:**
ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సమయానికి బస్సులు రాక, యాప్ లో సమాచారం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. "యాప్ పెట్టారు కానీ అందులో బస్సు ఎక్కడ ఉందో తెలియడం లేదు. సమయానికి కాలేజీకి వెళ్లలేకపోతున్నాం" అని విద్యార్థులు వాపోతు న్నారు. సాంకేతికత పేరుతో యాప్ ను తీసుకువచ్చిన అధికారులు.. దాన్ని సక్రమంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్:**
ఇప్పటికైనా కరీంనగర్ ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి, గన్నేరువరం రూట్ లో తిరిగే ప్రతి బస్సుకు గమ్యం యాప్ లో ట్రాకింగ్ సిస్టమ్ సక్రమంగా పనిచేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, బస్సుల సంఖ్యను పెంచాలని మండల ప్రజలు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

# రహత్‌నగర్‌లో సర్వే నంబర్ 80 భూమిపై గ్రామస్తుల స్పష్టీకరణ

**◆సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దు.. ◆అన్ని పార్టీల నాయకుల హితవు**



**భీమ్‌గల్ అక్టోబర్ 11 జనంసాక్షి :**
భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 80 భూమికి సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూమి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించింది కాదని, గ్రామానికి సంబంధించిన ఆస్తి విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా రాజకీయ రంగు పులమడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో అన్ని పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు మీడియా సమావేశం నిర్వహించి తమ వివరణ వెల్లడించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో పటేల్?పట్వారీ వ్యవస్థ అమల్లో ఉన్న సమయంలో భూములకు శిస్తు, పన్నులు చెల్లించి పట్టాలు పొందినట్లు వివరించారు. అప్పట్లో గ్రామంలో పనిచేసిన వడ్ల, కుమ్మరి, సుంకరి వర్గాలకు కొన్ని భూములు కేటాయించారని, సుంకరి కుటుంబానికి 10 ఎకరాల 26 గుంటల భూమిని ఇనాంగా ఇచ్చినట్లు తెలిపారు. కాలక్రమంలో సదరు కుటుంబం కనుమరుగవడంతో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. అనంతరం భూమి ఆక్రమణకు ప్రయత్నాలు జరగడంతో గ్రామస్తులంతా కలిసి భూమిని ప్రభుత్వానికి అప్పగించినట్లు వెల్లడించారు.గత వారం రోజులుగా సర్వే నంబర్ 80 భూమికి సంబంధించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని తెలిపారు. రెవెన్యూ శాఖ ఆర్ఐ అధికారిణి గ్రామానికి వచ్చి సర్వే నంబర్ 80లో అక్రమంగా ఏర్పాటు చేసిన మోటారును తొలగించే ప్రయత్నం చేసిన సమయంలో పోలీసులు శాంతిభద్రతలను కాపాడేందుకు తమ విధులు నిర్వర్తించారని వివరించారు. అయితే ఈ ఘటనలో పోలీసులు ఎస్ఐ తిరుపతి, మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులకు సహకరిస్తున్నారంటూ వీడియోలో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.మహేష్ కుమార్ గౌడ్ వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిగా పేరొందారని, ఆయనపై రాజకీయ ఆరోపణలు చేస్తూ వివాదానికి రాజకీయ రంగు పులమడం తగదని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో జరిగిన పరిణామాలపై అన్ని పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు చర్చించి వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**వాస్తవాలు తెలుసుకున్నాకే ప్రచారం చేయాలి**
సర్వే నంబర్ 80 భూమి విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయవద్దని గ్రామస్తులు సూచించారు. వైరల్ అవుతున్న వీడియోలను ఆధారంగా చేసుకుని వ్యక్తులపై, రాజకీయ నాయకులపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి ప్రచారాన్ని నిలిపివేయాలని, లేనిపక్షంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముందుకు వస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ లకావత్ తిరుపతి, ఉపసర్పంచ్ భూక్య సేవలాల్, మాజీ జడ్పీటీసీ బాధావత్ శర్మ నాయక్, మాజీ సర్పంచ్ రాజ్ నాయక్, మాజీ ఎంపీటీసీ వినుకొండ ధర్మపురి, దాసరి నర్సయ్య, జరుపుల రాములు, భూక్య షబిలాల్, బాణావత్ శ్రీనివాస్, భూక్య నర్సింగ్ నాయక్, కొండపల్లి రాజు, చెరుకు రాజు, బాధావత్ బాలు, మాలవత్ లింబాద్రి, దొంతుల మధు, కొండపల్లి అజయ్ తదితర గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ చోరీల ముఠా గుట్టురట్టు



మరో నిందితుడిని బిచ్కుంద పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పర్భాని జిల్లాకు చెందిన సత్నామ్ సింగ్ చందూ సింగ్ బావరి (39)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి సంబంధించి జిల్లాలో మొత్తం 19 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ముఠాకు చెందిన మరో నిందితుడు, సత్నామ్ సింగ్ బావమరిది తక్ షంషేర్ సింగ్‌ను భిక్నూర్ పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి తీగల చోరీ**

బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపన్‌పల్లి శివారులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని రాగి తీగలు, బుష్ రాడ్లు, విద్యుత్ నూనెను దొంగిలించారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ సోలేటి పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ పి. విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్, సీసీఎస్ సీఐ సంతోష్ గౌడ్, బిచ్కుంద ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అక్టోబర్ 11న మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఫత్లపూర్ శివారులోని రాజస్థాన్ ధాబా సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు, గస్తీ నిర్వహిస్తుండగా హోండా యునికార్న్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న సత్నామ్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో అతడు ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**జాతీయ రహదారుల పక్కన ఉన్న పొలాలే లక్ష్యంగా చోరీలు**

సత్నామ్ సింగ్ తన బావమరిది తక్ షంషేర్ సింగ్‌తో కలిసి కామారెడ్డి జిల్లాలోని జాతీయ రహదారుల పక్కన ఉన్న వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ట్రాన్స్‌ఫార్మర్లను కిందకు దించి, వాటిలోని విలువైన రాగి కాయిల్స్‌ను తొలగించి తీసుకెళ్లేవారని పోలీసులు గుర్తించారు.

**సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి చోరీలు**

చోరీలకు వెళ్లే ముందు నిందితులు తమ సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసేవారని, చోరీలు ముగించుకొని తిరిగి వచ్చిన తర్వాతే ఫోన్లను ఆన్ చేసేవారని పోలీసులు వెల్లడించారు. సైకిల్ ట్యూబ్ సహాయంతో రంపపు బ్లేడ్‌ను పొడవాటి కర్రకు కట్టి, విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్లను కిందకు దించేవారు. అనంతరం స్పానర్లు, కట్టర్లు వంటి పరికరాలతో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలను తొలగించి అపహరించేవారని తెలిపారు.

**ద్విచక్ర వాహనం, చోరీ పరికరాలు స్వాధీనం**

అరెస్టయిన సత్నామ్ సింగ్ వద్ద నుంచి చోరీలకు ఉపయోగించిన హోండా యునికార్న్ ద్విచక్ర వాహనం (నంబర్ ఓఆ 22 ఃఏ 7881), వివో జ39 5ఆ మొబైల్ ఫోన్, టార్చ్‌లైట్, స్క్రూడ్రైవర్, కట్టర్, కటింగ్ ప్లేయర్, సుత్తి, పొడవాటి ఇనుప రాడ్‌తో పాటు రాగి కాయిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు హెచ్చరించారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బిచ్కుంద సీఐ రవికుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ గౌడ్, బిచ్కుంద ఎస్‌హెచ్ఓ గుండెల రాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఐటీ కోర్ టీమ్, హెడ్ కానిస్టేబుల్ గణపతి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మీకాంత్, మోహన్‌లను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించినట్లు బిచ్కుంద సీఐ రవికుమార్ తెలిపారు.

## పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ఆడబిడ్డల వివాహాలు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాదీ ముబారక్ పథకం కింద 149 మంది లబ్ధిదారులకు రూ. 1,49,17,284, కళ్యాణ లక్ష్మి పథకం కింద 126 మంది లబ్ధిదారులకు రూ. 1,26,14,616 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ రెండు పథకాల ద్వారా మొత్తం 275 మంది లబ్ధిదారులకు రూ. 2,75,31,900 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టిందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఔఱం చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి ఎస్సై జ్యోతి

**ముస్తాబాద్ అక్టోబర్ 11 (జనం సాక్షి)**



ముస్తాబాద్ మండల కేంద్రంలో శ్రీవాణి బ్యూటీపాలను ప్రారంభించిన ఎస్సై జ్యోతి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడవాళ్లంతా అన్ని రంగాలలో ఎదగాలని ప్రతి రంగంలో కూడా మగవారికి పోటీగా ముందుండాలని మగవారి సంపాదన తో పాటు ఆడవారి సంపాదన కూడా తోడుంటే ఆర్థికముగా బలపడతారని వారి పిల్లల భవిష్యత్తు కూడా బాగుంటుందని ఎస్సై జ్యోతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రావణి బ్యూటీ పార్లర్ ఎస్సై జ్యోతి ప్రారంభించారు. పురాతన కాలంలో లాగా ఆడవారు ఇంట్లో కూర్చోకుండా ఏదో ఒక పని కుట్టు మిషన్, మగ్గం వర్క్, సారీ ప్రింటింగ్, ఇలాంటివన్నీ కష్టపడి ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని సొసైటీలో మీకంటూ ఒక గుర్తింపు తీసుకువసుకోవాలన్నారు. శ్రావణి బ్యూటీ పార్లర్ యజమాని కూర శ్రావణి సంతోష్ లాగా ప్రతి ఒక్కరు ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని అందులో గుర్తింపు పొంది మన సత్తా ఏమిటో నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాలు మహిళలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిన గన్నేరువరం సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు

**అనుచరులతో సహా హస్తం గూటికి... ఘనంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే!**



గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి): గన్నేరువరం గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన లచ్చినర్సు, తాజాగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తిమ్మాపూర్ (ఎల్ఎండి) లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ కండువా కప్పి సర్పంచ్ లచ్చినర్సు ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై లచ్చినర్సు పార్టీలో చేరడం అభినందనీయమని అన్నారు. గన్నేరువరం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లచ్చినర్సు వెంట సుమారు వంద మంది అనుచరులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కటకం తిరుపతి, ఖాసీంపేట గ్రామ సర్పంచ్ కర్నే చంద్రయ్య, చొక్కారావు పల్లె సర్పంచ్ అరికాంతం గోపాల్ రెడ్డి, గన్నేరువరం ఉప సర్పంచ్ రామంచ స్వామి, ఖాసీంపేట ఉప సర్పంచ్ సందవేని ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి, జిల్లా డిసిసి మాజీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి అనిల్, గన్నేరువరం గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, నాయకులు బుర్ర తిరుపతి గౌడ్, దొగ్గల ప్రదీప్, ముస్కు కరుణాకర్ రెడ్డి, పుల్లెల నరేందర్, వెదిరే విజేందర్, పురుషోత్తం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

**ముస్తాబాద్ అక్టోబర్ 11 (జనంసాక్షి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపెల సురేంద్రరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతో పాటు జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తూ కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. జిల్లాలో రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు లోన్ మంజూరు చేసి జీవనోపాధి కల్పించిన కేటీఆర్, వివిధ ప్రభుత్వ శాఖలో ఉద్యోగులు కల్పించిన కేసీఆర్, సిరిసిల్ల జిల్లాను సాధించి పోరాడి సాధించుకున్నాం, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎద్దడి నరసింహారెడ్డి, కొమ్ము బాలయ్య, ఎండి సర్వర్ పాషా, యాది మల్లేష్ యాదవ్, రాసమడుగు సంతోష్ రావు, శీలం స్వామి, చెవుల మల్లేష్ యాదవ్, కోడె శ్రీనివాస్, పల్లె సత్యం, గిసి శంకర్, దురగల బాలయ్య, తాళ్ల రాజు, శీలం వెంకటేష్, ఎండి అన్వర్, సుంసు గణేష్, పరిధి పట వెంకటేష్ ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



### 2025-26 వాస్తవ లాభాలు ప్రకటించి..

### - కార్మికులకు వాటా చెల్లించాలని సిఐటియు నిరసన..



**గోదావరిఖని, జనంసాక్షి :**

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆర్జీవన్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 35% వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ... శ్రామిక భవన్ నుండి మెయిన్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేయడం జరిగింది... ఈ సందర్భంగా మెండె శ్రీనివాస మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడిచినప్పటికీ సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వము రివ్యూ మీటింగ్ చేస్తున్నారే తప్ప వాస్తవ లాభాలు ప్రకటించకుండా కార్మికులకు రావలసిన వాటా చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గత అనేక సంవత్సరాల నుండి దసరా ముందు కార్మికులు ఆనందోత్సవాలతో పండగ జరుపుకోవాలని లాభాలు ప్రకటించి వాటా చెల్లించే ఆనవాయితీ ఉండేది అన్నారు. ఇప్పటివరకు లాభాలు ప్రకటించకుండా కార్మికుల వాటా నిర్ణయించకుండా సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వము కలిసి కార్మికుల కష్టాన్ని అవహేళన చేస్తూ అవమానపరుస్తున్నారని ఈ నిర్లక్ష్యాన్ని వైఖరిని నిరసిస్తూ ఆదివారం సింగరేణి వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో తక్షణమే లాభాలు ప్రకటించి 35% వాటా చెల్లింపు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కార్మికుల కష్టార్జితాన్ని హేళన చేయకుండా తక్షణమే లాభాలు తేల్చి వాటా చెల్లించాలని అలాగే సింగరేణి సంస్థకు బకాయి పడ్డ 59 వేల కోట్ల రూపాయలు తక్షణమే చెల్లించి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్ష కార్యదర్శులు వంగల శివరాం రెడ్డి, మెండె శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, జెల్ల గజేంద్ర, అనబోయిన శంకర్, పెద్దపల్లి శశికిరణ్, జంగపల్లి మల్లేష్, బూరుగుల రాములు, రాకేష్, రమేష్, ముల్కల శ్రీకాంత్, సిహెచ్ లక్ష్మణ్, 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలగోపాల్ సేవలు మరువలేనివి

**హుజురాబాద్, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** హుజురాబాద్ లోని వివిఎల్ఆర్ హాల్ లో ఆదివారం మానవ హక్కుల వేదిక, దళిత మరియు ప్రజా సంఘాలు కలిసి సంయుక్తంగా హక్కుల నాయకుడు బాలగోపాల్ 17వ వర్ధంతి సభను నిర్వహించాయి. ఈ సదస్సులో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ జీవన్ కుమార్, డాక్టర్ ఎస్ తిరుపతయ్య , తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు, న్యాయవాది ముక్కెర రాజు, ఆవునూరి సమ్మయ్య, హేతువాద సంఘం నాయకురాలు రమ, హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు ప్రసంగించారు. డా ఎస్ తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో, బాలగోపాల్ మూడున్నర దశాబ్దాల పాటు హక్కుల రంగంలో మేధావిగా, నాయకునిగా అందించిన సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. బాలగోపాల్ ఈనాటి కాలంలో ఇంకా జీవించి ఉంటే సమాజంలో అణగారిన వర్గాలకు కొండంత ధైర్యంగా ఉండేదని వారు పేర్కొన్నారు. వివిధ, పార్టీల, సంఘాల, నాయకులు, ప్రముఖులు, బండ శ్రీనివాస్, వర్దినేని రవీందర్ రావు, జీడి సారయ్య, సామ్రాజ్యం, భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకట్రాజం, పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, శివ దయాల్ సింగ్, కొత్తూరి రమేష్, బత్తుల తిరుపతి, మట్టెల తిరుపతి,జీడి రవితేజ, మార్వాడీ సుదర్శన్, రామంచ భరత్, బాబ్జీ సందేశాలు ఇచ్చారు. నిర్వాహకులుఈ సెప్టెంబరులో ఔఎం కోర్టు జీరం ఘాటీ నిందితులకు విధించిన ఉరిశిక్షలను వెంటనే రద్దు చేయాలని, వారు ఈ పాటికే 13 సంవత్సరాల జైలు జీవితం అనుభవించిన కారణంగా వారిని వెంటనే విడుదల చేయాలని,సీఆర్పీసి కి సవరణ చేసి దేశంలో ఎవరికీ, ఏ నేరాలకూ మరణ శిక్షలు విధించకుండా మరణ శిక్ష అనే శిక్షా రూపాన్ని రద్దు చేయాలని,దేశంలో కోట్లాది మంది సామాన్య ప్రజల ఓటు హక్కును రద్దు చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చేత ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయించాలని, నిరసన తెలియజేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ మరియు ఇతర నిరసనకారులపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధాన్ని వెంటనే ఆపి వేయాలని తీర్మాణం ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.






## వ్యాపార విజయంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యం

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 11, ( జనంసాక్షి)** కరీంనగర్‌లో 'సమతుల్యమైన వ్యాపారం సంతృప్తికరమైన జీవితం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కిసాన్‌నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌లో బ్రహ్మకుమారీస్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి దీప దీదీజీ వ్యాపారాభివృద్ధితో పాటు జీవితంలో సమతుల్యత, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక విలువల ప్రాధాన్యతను వివరించారు. ఛాంబర్ అధ్యక్షుడు చిట్టిమల్లు శ్రీనివాస్, విజయలక్ష్మి సిస్టర్, మనీషా సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## సాతారంలో ఘనంగా నవదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

### భక్తిశ్రద్ధలతో దీక్ష స్వాముల ప్రత్యేక పూజలు



**మల్లాపూర్, అక్టోబర్ 11(జనంసాక్షి)** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నవ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. దీక్ష స్వాములు ఎర్రని వస్త్రధారణతో నియమ నిష్ఠలను పాటిస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారు. శరన్నవరాత్రుల్లో దుర్గాదేవి తొమ్మిది అవతారాలైన రూపాలను పూజించడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు భక్తి భావాన్ని, సామాజిక ఐకమత్యాన్ని చాటుతున్నాయి. ఈ సందర్భంగా దీక్ష స్వాములు సాతారం గ్రామ ప్రజలకు నవదుర్గాదేవి శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ గౌడ్ ఉప సర్పంచ్ జగన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాంతయ్య, వై చైర్మన్ శ్రీనివాస్, క్యాషియర్ రాకేష్, మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపార విజయంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యం

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 11, ( జనంసాక్షి)** కరీంనగర్‌లో 'సమతుల్యమైన వ్యాపారం ? సంతృప్తికరమైన జీవితం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కిసాన్‌నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌లో బ్రహ్మకుమారీస్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి దీప దీదీజీ వ్యాపారాభివృద్ధితో పాటు జీవితంలో సమతుల్యత, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక విలువల ప్రాధాన్యతను వివరించారు. ఛాంబర్ అధ్యక్షుడు చిట్టిమల్లు శ్రీనివాస్, విజయలక్ష్మి సిస్టర్, మనీషా సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆచార్య జయశంకర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

### కరీంనగర్‌లో ఘనంగా విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యక్రమం

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 11 ( జనంసాక్షి):** విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కళాభారతి వేదికగా ఆచార్య జయశంకర్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐఐటీ, నీట్ తదితర పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దాదాపు 100 మంది విద్యార్థులతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉత్తమ ఉద్యోగులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులను ఏడు విభాగాల్లో ఎంపిక చేసి నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరయ్యారు. సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, జిల్లా నాయకులు కట్ట రవీంద్రాచారి, గద్దె జగదీశ్వర్ చారి, కనపర్తి దివాకర్, వెలిచాల వెంకటస్వామి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ చారి, కార్యదర్శి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు వెయ్యి మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు హాజరయ్యారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు ఉద్యోగుల సేవలను గుర్తించి గౌరవించాలనే లక్ష్యంతో పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు.

# సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయండి

### ఓసీపీ-3 కార్మికులకు టిబిజికెఎస్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పిలుపు

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)అక్టోబర్ 11:** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని లోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టిబిజికెఎస్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓసీపీ-3లోని కార్మికులను కలిసి సభకు హాజరుకావాలని ఆయన కోరారు. ఓసీపీ-3 ప్రాజెక్టు సెక్రటరీ మామిడి తిరుపతి ఆధ్వర్యంలో కార్మికులను కలిసి సభ లక్ష్యాలను వివరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం కార్మికుల గొంతుకగా నిలుస్తూ, సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార ప్రాతినిధ్య కార్మిక సంఘాలు అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించడంతోపాటు, సంస్థలో జరుగుతున్న పరిణామాలను కార్మికులకు వివరించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభకు హాజరుకానున్నారని ఐలి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని, సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి 36 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని, కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సింగరేణికి రావాల్సిన రూ.60,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్మిక గర్జన సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఐలి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, అకినపెల్లి సురేష్, ముక్కెర మహేందర్, కరుణం రవి, రౌతు రాజు, సంజీవ్ రెడ్డి, గుర్రాల లక్ష్మణ్, సహిత్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



## వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

### శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**హుజురాబాద్, అక్టోబర్ 11 (జనం సాక్షి):** దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయాల్లో అమ్మవారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర నామ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు. శ్రీబాల త్రిపుర సుందరిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గాదేవిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. యువత, భక్తులు అమ్మవారి దీక్షను ధరించారు. మండపాల వద్ద జై భవానీ నామస్మరణలు మారుమ్రోగాయి.



# ఆర్థిక రిజర్వేషన్లకు ప్రత్యేక చట్టం తేవాలి

**- కేంద్రానికి ఓసీ జేఏసీ మహిళా అధ్యక్షురాలు ప్రభావతి రెడ్డి డిమాండ్**
**- ఈ నెల 26న పరకాలలో పార్టీలకతీతంగా భారీ బహిరంగ సభ**

**హుజూరాబాద్, అక్టోబర్ 11 (జనం సాక్షి):** కులమతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఓసీ జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతి రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లో ప్రభావతి రెడ్డి మాట్లాడుతూ...కులమతాలకు అతీతంగా పేదలకు న్యాయం కోసమే తమ ఉద్యమమని సామాజిక వర్గానికీ, మతానికీ వ్యతిరేకం కాదని ప్రభావతి రెడ్డి స్పష్టం చేశారు. అన్ని వర్గాల్లోని ఆర్థికంగా బలహీనులైన పేదలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆర్థిక వెనుకబాటు తనాన్ని ప్రాతిపదికగా




తీసుకుని న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కోసం సామాజిక ఉద్యమకారుడు ప్రవీణ్ అరోరా ఆధ్వర్యంలో ఢిల్లీలోని రాజ్‌ఘాట్ నుంచి చేపట్టిన దేశవ్యాప్త రథయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగే వరకు ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

**26న పరకాలలో భారీ సభ- పూసల ప్రభావతి రెడ్డి**

ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఈ నెల 26న పరకాలలో ఓసీ జేఏసీ, బహుజన కుల సంఘాల ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రభావతి రెడ్డి వెల్లడించారు. ఈ సభ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన పేదల సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు, రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. పరకాల సభలో పెద్ద సంఖ్యలో జన సమీకరణతో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## చెల్పూర్‌లో గౌడ యూత్ నూతన కార్యవర్గం నియామకం నియామకం

**హుజూరాబాద్, అక్టోబర్ 11 ( జనం సాక్షి ) :** చెల్పూర్ గ్రామంలో గౌడ (కౌండిన్య) యూత్ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పంజాల నాగరాజు, ఉపాధ్యక్షులుగా పంజాల నవీన్, ప్రధాన కార్యదర్శి గా పంజాల అరవింద్ కోశాధికారిగా పంజాల శివ, జాయింట్ సెక్రటరీగా సుమంత్, కార్యదర్శులుగా కుమార్, తరుణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ... గౌడ యూత్ అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేస్తామని, యువతను సంఘటితం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటామని తెలిపారు. గౌడ



జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను సాధించేందుకు కృషి చేయడంతో పాటు, చెల్పూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.



## ఎమ్మెస్సీ ఫారం లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్

**ఎడపల్లి, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండలం ఎంఎస్సీ ఫారం గ్రామంలో ఆదివారం బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సహకారంతో 10 లక్షల సిఆర్ఆర్ ఫండ్ సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎమ్మెస్సీ ఫారం గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. భోజనం ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సహకారంతో ఇప్పటికే ఎన్నో నిధులను గ్రామంలో కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని మునుముందు సైతం మరిన్ని నిధులు తీసుకొని వచ్చి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధిలో పాలకవర్గంతో పాటు గ్రామస్తులు సైతం పూర్తి సహకారాన్ని అందించాలని సర్పంచ్ నోముల జయశ్రీ గౌడ్ కోరారు. ఈ మేరకు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి, రోడ్డు మంజూరు కోసం సహకరించిన ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్ లకు ఎమ్మెస్సీ ఫారం గ్రామ ప్రజల తరఫున గ్రామ అభివృద్ధి కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షబ్బీర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## యాసంగి పంటల సాగుపై రైతులతో ముఖాముఖి

**హాజరుకానున్న జిల్లా కలెక్టర్**
**మండల వ్యవసాయశాఖ అధికారి సిద్ధి రామేశ్వర్**

**ఎడపల్లి, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్‌లో అనుకూలమైన పంటల ఎంపిక, సాగు ప్రణాళిక మరియు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఈనెల 12వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని ఎడపల్లి మండల వ్యవసాయ



శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్ ఆదివారం తెలిపారు. ఎడపల్లి రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్నారని ఆయన అన్నారు. ఎడపల్లి మండలంలోని రైతు సోదరులు, సర్పంచులు, సహకార సంఘం చైర్మన్లు ఎడపల్లి రైతు వేదికకు హాజరై, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్ కోరారు.

# నిజామాబాద్‌లో సహకార సంఘాల నూతన కమిటీలపై సందిగ్ధం

**○రాష్ట్రవ్యాప్తంగా ప్రమాణ స్వీకారాలు.. నిజామాబాద్‌లో మాత్రం జాప్యం**
**○89 సంఘాల్లో మూడింటికే కొత్త పాలకవర్గాలు ○ ప్రభుత్వ ఆదేశాలున్నా అధికారుల నిర్లక్ష్యమా?**
**○ఎమ్మెల్యేలు, మంత్రి ఆదేశాలతో త్వరలో నియామకాలు: జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు**

**బోధన్, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సహకార సంఘం చైర్మన్లు నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ నామినేటెడ్ తరహాలో నియమించబడి ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పటికీ నిజామాబాద్ జిల్లాలో మాత్రం సహకార సంఘం నూతన కమిటీలకు మోకాళ్ల అడ్డు అయినట్టుంది. అయితే ప్రభుత్వ ఆదేశాల లేక జిల్లా సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యమా అనేది జిల్లా ప్రజలకు అర్థం కావడం లేదు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 89 సహకార సంఘాలు ఉండగా ఇప్పటివరకు ముచ్చటగా మూడు సహకార సంఘాలకు నూతన బాధ్యతలు తీసుకోగా మిగతా ఏ ఒక్క సహకార సంఘంకు నూతన కమిటీని ఎంపిక చేసిన దాఖలాలు లేవు. ఈ మూడు సహకార సంఘాలు సైతం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గంకు చెందినవి కావడం విశేషం. ఈసారి సహకార సంఘం కమిటీలు నామినేటెడ్ పదవులు కావడంతో ఎంతోమంది ఆశావహులు తమ పేర్లను సంబంధిత నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు అందించడంతో పాటు సదరు ఎమ్మెల్యేలు సైతం తమ అనుచరులకు పదవులు కట్టబెట్టే విధంగా తుది లిస్టును ఫైనల్ సైతం చేయడం జరిగింది. అయినప్పటికీ జిల్లా సహకార సంఘం అధికారులు ఇప్పటివరకు సహకార సంఘాలకు నూతన కమిటీ ఎంపికలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని సహకార సంఘాల చైర్మన్లు నూతన కమిటీల ఎంపిక సంబంధించి ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ ముఖ్యులతో కలిసి నూతన కమిటీని ప్రకటించిన విషయం అందరికీ




తెలిసిందే. అయితే పేర్లు ప్రకటించిన అభ్యర్థులు తాము నూతన కమిటీలో బాధ్యులమని చెప్పుకునేందుకే సరిపోతుంది కానీ ఇప్పటివరకు ప్రమాణ స్వీకారం చేసిన దాఖలాలు లేకపోవడం తో తీవ్ర నిరుత్సాహానికి గురికావాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకార సంఘంలో ఎన్నికల నిర్వహిస్తే విభేదాలకు తావిచ్చే ఆస్కారం ఉందనే ఆలోచనతో నామినేటెడ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే దేవుడు కరుణించిన పూజారి అడ్డు అయినట్లు ప్రభుత్వం సహకార సంఘాలకు నూతన కమిటీలను నియమించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ సహకార సంఘం జిల్లా అధికారులు మాత్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. కమిటీల ఎంపికలో ఎమ్మెల్యేలు సూచించిన చైర్మన్ డైరెక్టర్ల విషయంలో జిల్లా సహకార సంఘం అధికారులు చిన్నచిన్న తప్పిదాలను సైతం పెద్దగా చూపిస్తూ కొర్రీలు వేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా సహకార సంఘం అధికారులు వెంటనే స్పందించి జిల్లాలో సహకార సంఘం నూతన కమిటీలకు పదవీ బాధ్యతలు అప్పగించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని నిజామాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**సహకార సంఘం అధికారుల ప్రమేయం ఏమీ లేదు**

**జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావు**

ఈ విషయమై జనంసాక్షి జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావును వివరణ కోరగా, నిజామాబాద్ జిల్లాలో సహకార సంఘం నూతన కమిటీల ఎంపికలో సహకార సంఘం అధికారుల ప్రమేయం ఏమీ లేదన్నారు. అయితే ఇప్పటికే జిల్లాలో మూడు సహకార సంఘాలు నూతన కమిటీ ఎంపిక పూర్తయిందని మిగతా సహకార సంఘాలకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సంబంధిత మంత్రి ఆదేశాలతో త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావు వివరించారు.

## దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే సహించేది లేదు

**తెలంగాణ విద్యార్థి పరిషత్ హెచ్చరిక**

**బోధన్, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** దసరా సెలవుల సమయంలో ప్రభుత్వ సెలవుల నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లు తరగతులు నిర్వహిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మిసాలే నాగేష్ హెచ్చరించారు. విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలని, సెలవుల సమయంలో



విద్యార్థులను తరగతులకు హాజరు కావాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతుంది. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేస్తామని మిసాలే నగేష్ స్పష్టం చేశారు.

## పొరండ్ల పీఏసీఎస్ నూతన చైర్మన్ తిరుపతి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఆకుల నరసన్న పటేల్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** పొరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా తిరుపతి రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ తిరుపతి రెడ్డిని ఆకుల నరసన్న పటేల్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా రావుల కృష్ణ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్, ముస్తాపూర్ సింగిల్ విండో చైర్మన్ రమణారెడ్డి, ఊటూరు సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరంలో యువశక్తి ఫౌండేషన్ మెగా బంపర్ లక్కీడ్రా కూపన్ల విక్రయం ప్రారంభం!

### కేవలం రూ. 50 కే ఎలక్ట్రిక్ స్కూటీ గెలుచుకునే ఛాన్స్!



**గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మెగా బంపర్ లక్కీ డ్రా కూపన్ల విక్రయం ఆదివారం నుండే ప్రారంభించారు. ఈకార్యక్రమానికి స్పాన్సర్లుగా గన్నేరువరం ఉప సర్పంచ్ రామంచ స్వామి, 8వ వార్డు సభ్యులు మచ్చ సాయికృష్ణ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నేరువరం గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు హాజరయ్యారు.బంపర్ బహుమతులు: (ఒకటవ బహుమతి: ఎలక్ట్రిక్ స్కూటీ) (రెండవ బహుమతి: వాషింగ్ మెషిన్)(మూడవ బహుమతి: సైకిల్) (నాలుగవబహుమతి: మిక్సీ గ్రైండర్) (ఐదవ బహుమతి: ఫ్యాన్) మరియు 5 కన్సోలేషన్ బహుమతులు ఉన్నాయి. కూపన్ ధర కేవలం రూ. 50/– మాత్రమే. కూపన్లు కావాల్సిన వారు వివేకానంద విగ్రహం దగ్గర సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, యువశక్తి ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మనం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నామా

### మాల వేసుకునే వెసులు బాటు కూడా ఇవ్వకుండా అక్రమ అరెస్టు



**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :** కరీంనగర్ డంప్ యార్డ్ సమస్య వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నిస్తున్నందున ప్రముఖ సామాజిక కార్యకర్త కోట శ్యామ్ కుమార్ ని అక్రమ అరెస్టు చేశారు. అమ్మవారి మాల వేసుకోవాలి సమయం వెసులు బాటు ఇవ్వండి అని అడిగిన అక్రమంగా అరెస్టు చేశారు అని కోట శ్యామ్ కుమార్ పేర్కొన్నారు.మనం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నామా అని ఆయన ప్రశ్నించారు.



## పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగి హక్కు

- సిపిఎస్ విధానంపై లోక్ సత్తా జయప్రకాష్ నారాయణ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం
- రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే సిపిఎస్ విధానంపై కమిటీ వేయాలి
- టిసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్



**గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ఆలోచించి కమిటీ వేసే తరుణంలో సిపిఎస్ పై లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అర్థరహిత వ్యాఖ్యలు చేయడం తగదని టిసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. ఆదివారం గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ.. పెన్షన్ ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగుల హక్కు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యమం ఉప్పెనలా కొనసాగుతుందని పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు అలుపెరుగని పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. సిపిఎస్ విధానంపై జయప్రకాష్ నారాయణ చేసిన వ్యాఖ్యలు సిపిఎస్ ఉద్యమాన్ని నీరు గార్చేలా ఉన్నాయని చేసిన వాఖ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే సిపిఎస్ విధానంపై కమిటీ వేయాలని ఆ కమిటీలో నిష్పక్షపాతంగా తెలంగాణ రాష్ట్రంలోని సిపిఎస్ సంఘాలన్నింటినీ కమిటీలో సభ్యులుగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

### మాజీ సర్పంచ్ మట్ట రాజిరెడ్డి మృతి



**ముస్తాబాద్ అక్టోబర్ 11 (జనంసాక్షి)** ముస్తాబాద్ పట్టణ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు మట్ట రాజిరెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలో ప్రతి ఒక్కరి ఆప్యాయంగా పలకరించే నాయకుడు మన మధ్యలో లేడాని కన్నీటి పర్వమయ్యారు, మట్ట రాజుతో రాజకీయంగా పనిచేసిన నాయకులు జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ బాధ పడుతున్న నాయకులు



## ఓటర్ల జాబితా శుద్ధీకరణతో పారదర్శకత జాడి బాల్‌రెడ్డి

**కరీంనగర్ కల్చరల్,జనంసాక్షి :** ఓటర్ల జాబితాలో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియ దోహదపడుతుందని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని కొత్త యాస్వాడలో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి బహుళ ఓట్లు ఉండటం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి సమస్యలను సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, జాబితాలోని తప్పులను సవరించడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలో పేరు నమోదు కానివారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడానికి ఫారం–7 ఉపయోగించవచ్చని తెలిపారు. అర్హులైన ఓటర్లు సంబంధిత దరఖాస్తులను అవసరమైన ఆధారాలతో సమర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ టి పి సి లో బతుకమ్మ బహుమతుల పంపిణీ..



**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రజా ప్రతినిధులతో ఈడీ (ఆర్ అండ్ టి), పీఏవీలకు బతుకమ్మ బహుమతుల పంపిణీ, సమాజ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చేపట్టిన వివిధ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలకు నిధుల సమీకరణపై చర్చించేందుకు ఎన్‌టీపీసీ రామగుండం అండ్ తెలంగాణ ఆర్ అండ్ టి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్ ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. బతుకమ్మ పండుగ సందర్భంగా, పండుగ స్ఫూర్తిని పురస్కరించుకుని, స్థానిక సమాజంతో ఎన్‌టీపీసీ బంధాన్ని బలోపేతం చేసే సద్భావన చర్యగా ప్రాజెక్ట్ బాధిత గ్రామస్థులకు (పీఏవీలకు) బహుమతులు కూడా పంపిణీ చేశారు.

## సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది సాహితీ వేడుకలు



**సిరిసిల్ల టౌన్: జనంసాక్షి :** జిల్లాగా మారకముందు కన్నా మారాక సిరిసిల్ల రూపురేఖలు మారిపోయాయని అంచ లంచెలుగా అభివృద్ధి పథాన కొనసాగిందని, అష్టావధాని, పండిత వర్యులు తిగుళ్ళ శ్రీహరి శర్మ, కొనియాడారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది సాహితీ సభ కవి సమ్మేళనం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి, మారసం ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, వాసరవేణి పర్శరాం, ఆధ్వర్యంలో నిర్వహించారు. వాఖ్యాతగా,ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ వ్యవహరించి తమ కవితా గానం వినిపించారు. అనంతరం పలువురు కవులు తమ తమ కవితలు ద్వారా ఆకట్టుకున్నారు. ఇద్దరు యువకులు సాయి కృష్ణ బొక్క రాజేష్ కూడా పాల్గొని ప్రసంగించి కవితను ఆలపించారు. ఎల్లారెడ్డిపేట వేములవాడ తదితర ప్రాంతాల నుండి కవులు కదిలి వచ్చి సిరిసిల్ల జిల్లాగా మారిన విధానాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రతి కవికి శాలువా, మెమొంటోలు అందించి సత్కరించారు. సీనియర్ సిటిజన్ అధ్యక్షులు జనపాల శంకరయ్య, గీతా ప్రచార సేవా సమితి అధ్యక్షులు కోడం నారాయణ, బూర దేవానందం ,కవులు అంకారపు రవి, గణేష్, గుండెల్లి వంశీ, జిందం అశోక్, హాఫీజ్ రమేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## గాగిరెడ్డిపల్లె రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కలువల రాజేశ్వర్ రెడ్డి ఎన్నిక

- ఉపాధ్యక్షులుగా అన్నాడి నరసింహారెడ్డి..
- కార్యదర్శిగా అన్నాడి మల్లికార్జున్ రెడ్డి ఎన్నిక



**చిగురుమామిడి అక్టోబర్ 11(జనంసాక్షి):** మండలంలోని గాగిరెడ్డిపల్లె గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కలువల రాజేశ్వర్ రెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా అన్నాడి నరసింహారెడ్డి, కార్యదర్శిగా అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి మహేందర్ రెడ్డి,డైరెక్టర్లుగా సింగిరెడ్డి శంభురెడ్డి, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, కలువల రాజు,సింగిరెడ్డి జనార్దన్ రెడ్డి,సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి,బద్దం కార్తీక్ రెడ్డిలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులు కలువల రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు.రెడ్డి సంఘం సభ్యులకు ఎలాంటి ఆపద వచ్చిన అందుబాటులో ఉంటామన్నారు.గాగిరెడ్డిపల్లి రెడ్డి సంఘంలో దాదాపు 90మంది సభ్యులు ఉన్నట్లు పేర్కొన్నారు.రెడ్డి సంఘం సభ్యులమంతా ఐకమత్యంతో కలిసి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.తమపై నమ్మకంతో తమను ఎన్నుకున్న రెడ్డి సంఘం సభ్యులందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

# మహాదేవ్ హైట్స్ వివాదంపై టీజీ రెరా సంచలన తీర్పు

## నిబంధనలు ఉల్లంఘించిన డెవలపర్, భూ యజమానులపై చర్యలకు రెరా ఆదేశాలు..

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కలకలం రేపిన 'మహాదేవ్ హైట్స్' రియల్ ఎస్టేట్ వివాదంలో తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) సంచలన తుది ఉత్తర్వులు వెలువరించింది. ప్రాజెక్ట్ రిజిస్ట్రేషన్‌కు ముందే ఫ్లాట్ల విక్రయాలు చేపట్టి, నిబంధనలు తూట్లు పొడిచిన డెవలపర్ మరియు భూయజమానులపై జరిమానా కోరుతూ రుషించింది. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెరా సెక్రటరీని ఆదేశించింది.

**వివాదం వెనుక కథ ఏమిటి?**

నిజామాబాద్‌లోని సర్వే నెంబర్లు 234, 251/ఎ పరిధిలోని 4,000 చదరపు గజాల స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఒప్పందం కుదిరింది. 'మాజిక్‌బ్రిక్స్' భాగస్వామి బెల్లాల్ శశాంక్ రెడ్డి (డెవలపర్ - రెస్పాండెంట్ 1) మరియు భూయజమానులు అకుల సుభాష్, గజవాద్ ప్రదీప్, బెల్లాల్ ప్రవీణ్ కుమార్ (రెస్పాండెంట్లు 2 నుండి 4) సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను తలపెట్టారు. ఈ ప్రాజెక్ట్‌లోని 2వ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నంబర్ 205 (1875 చదరపు అడుగుల సూరజ్ బిల్డప్ ఏరియా)ను కొనుగోలు చేయడానికి తుమ్మా శ్రీనివాస్ అనే వ్యక్తి రూ. 51,00,000 చెల్లించారు. అయితే ప్రాజెక్ట్‌లో అనుమతి ఉల్లంఘనలు జరిగాయని, నాణ్యత లేని నిర్మాణం చేపట్టారని, నిర్ణీత గడువులోగా పొజిషన్ ఇవ్వలేదంటూ శ్రీనివాస్ రెరాను ఆశ్రయించారు. తాను చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని కోరారు.

**టీజీ రెరా కీలక నిర్ణయాలు తీర్పు. ఫిర్యాదుదారు**

పేరుతో ఫిబ్రవరి 23, 2023 నాడే రిజిస్టర్డ్ సేల్ డీడ్ పూర్తయినట్లు రెరా గుర్తించింది. బ్యాంకు ద్వారా రుణం తీసుకోవడం, ప్లాస్టరింగ్ పనులు జరగడం వంటి పరిణామాలను బట్టి కొనుగోలుదారు ఆస్తిపై యాజమాన్య హక్కులు పొందారని స్పష్టమైంది.

సేల్ డీడ్ పూర్తయిన తర్వాత రెరా చట్టం - 2016 సెక్షన్ 18 ప్రకారం ప్రాజెక్ట్ నుంచి వైదొలగి డబ్బులు వాపసు కోరే అవకాశం ఉండదని తేల్చిచెప్పింది. 'మహాదేవ్ హైట్స్' ప్రాజెక్ట్‌కు జూలై 7, 2023 న రెరా రిజిస్ట్రేషన్ లభించింది. అంతకంటే దాదాపు నాలుగు నెలల ముందే అనగా ఫిబ్రవరి 23, 2023 నాడే ఫ్లాట్ల విక్రయాలు మరియు రిజిస్ట్రేషన్ చేయడం చట్ట విరుద్ధమని రెరా సభ్యులు కే. శ్రీనివాస్ రావు మరియు లక్ష్మి నారాయణ జన్ను వెల్లడించారు.

**భూయజమానుల ప్రమోటర్లే.**

ఫిర్యాదుదారు శ్రీనివాస్ ఆరోపణలను డెవలపర్, యజమానులు తీవ్రంగా ఖండించారు. ఫ్లాట్ మొత్తం ధర రూ. 54.50 లక్షలు కాగా, కేవలం రూ. 40.50 లక్షలు మాత్రమే చెల్లించారని, ఇంకా రూ. 14 లక్షలు బకాయి ఉందని తెలిపారు. ఫ్లాట్ రిజిస్ట్రేషన్ ఎప్పుడోరిగిపోయిందని, ఫిర్యాదుదారు కోరికమేరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి ఇంటీరియర్ పనులు నిలిపివేశామని చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు ముందే మార్కెటింగ్, బుకింగ్‌లు మరియు విక్రయాలు జరపడం సెక్షన్ 3 నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తూ సెక్షన్ 59 ప్రకారం ప్రతివాదులపై తగిన జరిమానా చర్యలు తీసుకోవాలని రెరా సెక్రటరీని ఆదేశించారు. మొత్తానికి, రిజిస్ట్రేషన్‌కు ముందే సేల్స్ చేపట్టిన బిల్డర్లకు ఈ తీర్పు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని, రియల్ రంగంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని టీజీ రెరా ఈ తీర్పు ద్వారా గట్టి హెచ్చరిక పంపింది.



# దేవునిపల్లిలో అమ్మవారి ఆగమనానికి మంగళహారతులు

## భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ..

## ఆధ్యాత్మిక వాతావరణంలో గ్రామం దేవునిపల్లి..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి )**

దేవునిపల్లిలో అమ్మవారి ఆగమనాన్ని పురస్కరించుకుని భక్తులు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిపై భక్తిని చాటుకుంటూ మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆగమనంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. సంప్రదాయ ఆచారాలు, భక్తి కార్యక్రమాలతో దేవునిపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.



## భీంగల్‌లో వైభవంగా దేవి శరన్నవరాత్రి

# ఉత్సవాలు ప్రారంభం

**అమ్మవారి నామస్మరణతో మార్మోగిన పట్టణం**

**భక్తిశ్రద్ధలతో ఎదుర్కోలు కార్యక్రమం**

**భీంగల్ అక్టోబర్ 11జనంసాక్షి :**

భీంగల్ పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అయ్యప్ప నగర్, శ్రీరామ్ నగర్, రాజారామ్ నగర్, విఘ్నేశ్వర కాలనీ, విద్యానగర్‌తో పాటు నందిగల్లీ, బోదిరే గల్లీ తదితర కాలనీల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సుదర్శన్ టాకీస్ నుంచి అమ్మవారిని మేళతాళాలు, బాజాభజంత్రీలు, మంగళహారతుల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు అమ్మవారికి ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పట్టుకుని అమ్మవారికి స్వాగతం పలకగా, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారి నామస్మరణలు, భక్తి గీతాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. నవరాత్రి ఉత్సవాల తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హారతులు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. పలు కాలనీల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు కాలనీల ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తున్నాయి. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా కొనసాగేందుకు ఆయా కాలనీల ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# తులం బంగారం హామీని నిలబెట్టుకోవాల్సిందే

**◆అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**◆కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్**

**◆పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

**◆నిజామాబాద్‌లో 275 మందికి చెక్కుల పంపిణీ**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు తులం బంగారం కచ్చితంగా ఇవ్వాల్సిందేనని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హామీలు, పథకాల అమలు తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కళ్యాణ లక్ష్మి పథకం అమలుపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని, ఈ పథకాన్ని నిలిపివేస్తారనే పుకార్లు కూడా వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వదంతులపై అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అవుతున్నందున, హామీ ఇచ్చిన విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ తులం బంగారం అందజేయాలని, కనీసం ఆనాడు హామీ ఇచ్చిన సమయానికి ఉన్న ధర ప్రకారమైనా బంగారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా చెక్కులను అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 275 మంది లబ్ధిదారులకు సుమారు 2.75 కోట్ల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నూడా చైర్మన్ కేశ వేణు, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, జగదీష్ కులకర్ణి, న్యాలం సునీత రాజు, బంటు ప్రీతి ప్రవీణ్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, అలాగే పలువురు ముఖ్య నాయకులు పంచరెడ్డి శ్యామ్, పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

# అమారా హోటల్ ను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనం సాక్షి:**

నగరంలోని ఆర్మూర్ రోడ్ లో గల అమారా హోటల్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ కూరగాయల ఉమారాణి, ఎమ్మెల్సీ రవీందర్, మూడవ డివిజన్ కార్పొరేటర్ ప్రసూన శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి నిజామాబాద్‌కు వచ్చే వారికి నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా హోటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హోటల్ నిర్మాణం ఆకర్షణీయంగా ఉందని పేర్కొంటూ, ఆహార నాణ్యతతో పాటు పరిశుభ్రత, నిర్వహణ విషయంలోనూ నిరంతరం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటయ్యే నేపథ్యంలో నగరానికి వచ్చే పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, సందర్శకులకు మెరుగైన వసతి సౌకర్యాలు అవసరమని తెలిపారు. ఈ క్రమంలో ఆధునిక హోటళ్లు నగర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమారా హోటల్ యాజమాన్యం ప్రతియాస్ రెడ్డి, ప్రణవ్ చంద్రారెడ్డి, దినేష్ రెడ్డి, పురాన్ రెడ్డి, స్రవంతి రెడ్డి, ప్రసన్న కుమారి, అశోక్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని హోటల్‌ను ప్రారంభించారు. రిబ్బన్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, పలువురు ప్రముఖులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

## ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

**నిజాంసాగర్, అక్టోబర్ 11(జనంసాక్షి):** ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

**గోర్గల్ గ్రామంలో ప్రత్యేక పూజలు**

నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మ వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజ లందరూ సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు.



**తొమ్మిది రోజులపాటు వైభవంగా ఉత్సవాలు**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారి అలంకరణలు, పూజా కార్యక్రమాలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలగనుంది. తొలి రోజు నుంచే భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దుర్గాదేవి అనుగ్రహంతో ప్రజలకు సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, భక్తులు ఆసక్తి చూపుతున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ ఖదీర్

### నియామక పత్రం అందజేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి)**

కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ ఖదీర్ (సయ్యద్ మసూద్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాజ్‌కు, రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీకి, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అజీమ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని సయ్యద్ ఖదీర్ పేర్కొన్నారు. మైనార్టీ వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆయన వెల్లడించారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

### మీటర్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం చికిత్స పొందుతూ మృతి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 జనంసాక్షి:** నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇంటి వద్ద విద్యుత్ మీటర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కరసం చంద్ర శేఖర్ (42) మృతి చెందాడు. ఈ ఘటనతో కాలనీలో విషాదం నెలకొంది. అంబేద్కర్ కాలనీకి చెందిన కరసం చంద్రశేఖర్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో తన ఇంటి వద్ద ఉన్న విద్యుత్ మీటర్‌కు మరమ్మతులు చేస్తుండగా అనుకోకుండా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన చంద్రశేఖర్‌ను కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజామాబాద్ మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో టౌన్ ఎస్ఐ హరిబాబు తెలిపారు.

# కొలువుదీరిన దుర్గామాతలు

### అంగరంగ వైభవంగా ఉత్సవమూర్తులకు స్వాగతం

**ఇందల్వాయి అక్టోబర్ 11 జనంసాక్షి**



ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించారు, ఆదివారం దుర్గామాత విగ్రహాలను మంగళహారతులతో డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తూ అమ్మవారిని గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ప్రతిష్టించారు, ఈ సందర్భంగా అమ్మవారికి ఇష్టమైన కుంకుమ అర్చన, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు, మండలంలోని ఇందల్వాయి గ్రామం తో పాటు గన్నారం, ఎల్లారెడ్డిపల్లి, నల్లవెల్లి, సిర్నాపల్లి, చంద్రన్ పల్లీ, మల్లాపూర్, లోలం, తదితర గ్రామాలలో దుర్గామాత విగ్రహాలను ప్రత్యేక ఆకర్షణ తో ఊరేగించారు అనంతరం అమ్మవారికి ప్రత్యేక మొక్కులు సమర్పించుకున్నారు, గ్రామంలోని ఆడపడుచులు అమ్మవారికి మంగళహారతులతో అంగ రంగ వైభవంగా స్వాగతం పలికారు, ఆయా గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లతోపాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు, నేటి నుండి తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నవరాత్రి ఉత్సవాలను ఆయా గ్రామాల్లో దుర్గ మాత విగ్రహ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు, ఈ కార్యక్రమంలో సర్పంచులు లోకల్, సుజాత శ్రీనివాస్, ఆరేటి రఘు, మటముల శేఖర్, కన్నె రాజేందర్, ఇందల్వాయి సింగల్ విండో చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, నల్లవెల్లి సింగిల్ విండో చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, మారుతి నాయక్, హంసన్పల్లి రాజేందర్ రెడ్డి, చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఇందల్వాయి విద్యార్థులు

**ఇందల్వాయి అక్టోబర్ 11 జనంసాక్షి**



ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 11 .12 .13 తేదీలలో మెదక్ జిల్లా తూప్రాన్ లో జరుగుతున్నటువంటి 45వ జూనియర్ బాయ్స్ షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో జడ్పిహెచ్ఎస్ ఇందల్వాయి పాఠశాల చెందిన విశాల్. సతీష్. సాత్విక్. గణ శ్యాం. నలుగురు క్రీడాకారులు సెలెక్ట్ అయినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి రాజేశ్వర్ తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ లోకని గంగమని గంగారం, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, తోపాటు పాఠశాల అభ్యున్నతికి పాటుపడే పలువురు హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, మరియు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పాల్గొని క్రీడాకారులను అభినందించడం జరిగింది.

# జోర్ధార్ గ కొనసాగిన శ్రీ నిమిషాంబ దేవినవరాత్రి పూజలు

**బాల్కొండ న్యూస్ 11 అక్టోబర్ (జనంసాక్షి)**

అలకొండ పురి రమ్య నగై: నవబి రావృతా !తత్రేషా తు మహాదేవి నిమిషాంబా ప్రతిష్ఠితా!! (తొమ్మిది ఏతైనా నల్ల రాల్ల కొండల చేత చుట్టబడి ఉన్న అందమైన అల్లకుండ,వల్లకొండ, ఏ బాల్కొండలో 526 సంవత్స రాలనుండి శ్రీ నిమిషంబ దేవి కొలువై ఉంది. నిజామాబాదు జిల్లా బాల్కొండ లో ఉన్న శ్రీ నిమిషంభ దేవి అమ్మ వారినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు అమ్మ వారికి అబిషేకం నిర్వహించగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన నారీ మానులచే అమ్మవారికి మొక్కులు,ఒడి బియ్యాలు సమర్పించు కున్నారు. ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నా మని ఆలయ సేవకులు వివరించారు. నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16 శుక్రవారం టోకెన్ నేం (81) హైదరాబాద్ లోని సైనిక పురికి చెందిన ధనలకోట భూపతి వర్మ జ్యోతి, మనోజ్,స్వప్న, వి. వినేద్ర వర్మ,సౌమ్య వై. అరన్ కుమార్, స్రవంతి కుటుంబం వారిచే “అన్నదానం’ నిర్వ హిస్తున్నామని ఆలయ సేవకులు బి. గంగాధర్ తెలిపారు.”అన్నదానం చేస్తే పుణ్యఫలం, ఆకలితో ఉన్న వారికి అన్నం దానం చేయడం వల్ల “నిత్యం అన్నపూర్ణ “ కొలిచినట్లే కాకుండా ఆ ఇంట్లో సిరి సంపాదలకు నిలయంగా మారు తుందని ఆలయ సేవకులు బి. ఆర్. నర్సింగ్ రావుఈ సందర్భంగా విజ్ఞప్తి చేసారు.

**ఆలయంలో పనులకు చేయూత ఇవ్వండి**

ఈ ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరుగా నున్నాయని (1).ఆలయంలో ఉత్తర దక్షిణ సింహ ద్వారం పనులు.(2).శ్రీ నిమిషంబ దేవి కల్యాణ మండపం నిర్మాణం త్వరలో ప్రారంభం కాబోతున్నాయని అమ్మ వారి భక్తులు పంపే కానుకలు “ శ్రీ నిమిషంబ దేవి టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ “ అకౌంట్ నుంబర్ 073710011109628 యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా “బాల్కొండ “ నిజామాబాదు బ్రాంచి ఐ. ఆఫ్. ఎస్.సి. నేం.యి.బీ.ఐ.యన్. 0807371.లేదా క్యూ.. ఆర్. కోడ్ ద్వారా పంపి “స్క్రీన్ షాట్” ను 9666759297 నంబర్‌కు పంపాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు.

**అన్న దానానికి ఖాళీలు**

2026, నవంబర్ నుండి 2026 డిసెంబర్ వరకు ప్రతి నెల మొదటి శుక్రవారాల్లో అన్నదానం చేయాలనుకు నే కుటుంబాలు తమ కుటుంబ పేర్లు, గోత్రాలు మరియు కుటుంబ సమూహ ఫోటోలతో 9666759297 నంబ ర్‌కు ఫోన్ చేసి టోకెన్ నంబర్ పొందాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు.

**కనపడటం లేదు**

నేటి రోజుల్లో నారి మణుల్లో నుదుటన కుంకుమ,కళ్ళకు కాటిక, తలలో పూలు, అంద మైన వాలు జడ, చేతులకు గాజులు, ఒళ్ళు నిండా చీర, జాకెట్,కాళ్లకు మట్టేలు, కాకుండా నేటి స్త్రీలు నుదుటిన చిన్న టికిల్ బొట్టు, పెదవులకు లిప్టిక్,తల వెంట్రు కలు విర బూసిన వెంట్రుకలు, ఒళ్ళు కనిపించే విధంగా రెడీ మేడ్ వస్త్రా లను ధరించి ఆలయాల్లో కి వస్తే ఆలయంలోకి ప్రవేశం లేదని తేల్చి చెప్పారు.

**ఈ క్షేత్రానికి ఏలా చేరుకోవాలి**

భారత దేశంలోనే 4 వ పంచంలోహ విగ్రహం తో కొలువై ఉన్న శ్రీ నిమిషంబ దేవిబాల్కొండలోనే కొలువై ఉందని పవిత్ర శక్తి స్వరూపిణి ఆలయం హైదరాబాద్ పట్టణానికి 200 కిలోమీటర్ దూరంలో హైదరా బాద్ - నాగపూర్ జాతీయ రహదారిని ఆనుకొనే బాల్కొండ ఉందని,బస్సు రవాణా సౌకర్యాలు ఉన్నాయి.



# అచ్చంపేట సొసైటీ చైర్మన్, పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు!

## రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధిలో పాలకవర్గం సేవలు అభినందనీయం

**నిజాంసాగర్, అక్టోబర్ 11 జనంసాక్షి**
నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ గుమస్తా శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలికారు. సొసైటీ అభివృద్ధికి, రైతులకు సేవలందించడంలో పాలక వర్గం అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా సొసైటీ సిబ్బంది గుర్తుచేసుకున్నారు. అచ్చంపేట సొసైటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సంగమేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ గుమస్తా శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులు మర్రి చిన్నరాములు, లంబాడి సక్రుబాయి, బండారి గంగమణి, అబ్బెరబోయిన సాయిలు, విఠల్ గౌడ్, గైనీ సాయవ్వ, భూమయ్య, రాజం సాయిలు, కాశయ్యలను సత్కరించారు.



**సహకార రంగంలో సేవలు చిరస్మరణీయం**

సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించడం, సంఘం కార్యకలాపా లను ముందుకు తీసుకెళ్లడంలో పాలకవర్గ సభ్యుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు అందించిన సహకారం, సిబ్బందితో సమన్వయంతో పనిచేసిన విధానం సంఘం కార్యకలాపాల్లో ముఖ్యమైనదని కొని యాడారు. అనంతరం సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, పాలకవర్గ సభ్యులు అందించిన సేవలను అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది రాజేందర్, నర్సింలు, రాహుల్, బాబాసింగ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంలో దొంగల హల్చల్..

## దోచుకెళ్లిన నగదు..




**గాంధారి అక్టోబర్ 11 జనంసాక్షి**
గాంధారి మండల కేంద్రంలో కామారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారిపై ఎస్బిఐ ఎటిఎం లో దొంగలు చోరీకి పాల్పడి నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 1 నుండి ఒకటిన్నర గంట ప్రాంతంలో జరిగినట్లు స్థానికులు పోలీసులు తెలిపారు. నగదు ఎంత పోయింది అనేది ఇంకా తెలియాల్సి ఉంది. పూర్తి వివరాల కోసం స్థానిక ఎస్సై మహేందర్ కు పలుమార్లు చరవాణిలో సంప్రదించే ప్రయత్నం చేసినప్పటికీ ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదు. నగదు ఎస్బిఐ ఏటీఎంలో ఎంత నగదు ఏ రోజు పెట్టారు... అందులో నుంచి ఎంత నగదు విత్డ్రా చేశారు అనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెద్దమ్మ దేవాలయంలో వైభవంగా దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి రథం ఊరేగింపును ప్రారంభించారు. పెద్దమ్మ తల్లి దేవాలయంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెల కొంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కామారెడ్డి పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. హిందూ సంస్కృతి, సంప్రదాయా లను పరిరక్షించడంలో ఆధ్యాత్మిక ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాళ్ళ గంగరాజు, కాళ్ళ గణేష్, దుబ్బాక ప్రసాద్, శంకర్, నర్సింలు, నాగరాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# అసైన్డ్ భూములకు యజమాని హక్కులు కల్పించాలి

## తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

నిజాంసాగర్, అక్టోబర్ 6 **(జనంసాక్షి):**
నిజాంసాగర్ మండలంలోని వివిధ గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో ఉన్న అసైన్డ్ భూములకు అర్హులైన లబ్ధిదారులకు యజమాని హక్కులు కల్పించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సర్వగల రవీందర్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం నిజాంసాగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం యజమాని హక్కులు కల్పించి, వారి భూములకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మార్వో ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి తగిన నిర్ణయం వచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తన పరిధిలో సాధ్యమైనంత వరకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పి. సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంబపూర్ రవి, జిల్లా యువసేన అధ్యక్షులు రాజు, జిల్లా యువ సేన ప్రచార కార్యదర్శి రవికుమార్, మండల గౌరవ అధ్యక్షులు పరువయ్య, జిల్లా కార్యదర్శి రాములు, కోడ్పుగల్ మండల ఉపాధ్యక్షులు ఎర్రల్లో శ్రీమన్, అంబేద్కర్ ఉపాధ్యక్షులు జంజీర్ దుర్గయ్యతో పాటు సాయిలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

## ఉత్సవాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించిన డీఎస్పీ మధుసూదన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి):** దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్‌తో పాటు పట్టణ ఇన్‌స్పెక్టర్ నరహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మధుసూదన్ మాట్లాడుతూ.. ఇటీవల కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయని తెలిపారు. డీజేలకు దూరంగా ఉంటూ డప్పు చప్పుళ్లతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో రానున్న దేవి నవరాత్రి ఉత్సవాలను కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, భక్తిప్రపత్తులతో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పండుగలను ఐకమత్యంతో, సోదరభావంతో జరుపుకోవడం ద్వారా పట్టణంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించవచ్చని తెలిపారు.



# భవానీ మాల స్వీకరించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఅక్టోబర్ 11 (జనంసాక్షి)**
దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీ శారదామాత ఆలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ భవానీ మాల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఇప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ.. దుర్గామాత కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలను నింపాలని, అందరికీ మంచి జరగాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి, గరిపల్లి శ్రీధర్, కృష్ణారెడ్డి, సుధీర్ రెడ్డి, విష్ణు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అబ్బగొని అశోక్ గౌడ్‌కు గౌ డాక్టరేట్ ప్రదానం



**బాల్కొండ న్యూస్ 11 అక్టోబర్ (జనంసాక్షి)**
చెన్నై లో కృష్ణ గానసభలోయునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్అందుకున్న అబ్బగోని అశోక్ గౌడ్. 20 ఏళ్లుగా సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్నారు. ఆయన నిరుపేదలకు అండగా నిలవడం, నిరుద్యోగ యువత కు మార్గదర్శనం అందించడం, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటు న్నారు. గత రెండు దశాబ్దా లుగా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ? నిరుపేదలకు సహాయం, అనారోగ్యంతో ఉన్న పేదలకు వైద్య సహాయం, అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమన్వయం చేయడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా? సమాజానికి తన వంతు సహకారం అందిస్తున్నారు. మానవత్వం, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యత అనే లక్ష్యాలతో నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల్ చిట్టాపూర్ గ్రామం నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్బగొని అశోక్‌గౌడ్‌కు డాక్టరేట్ లభించడం పట్ల నిజామాబాదు జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షులు బి. ఆర్. నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులు డా,, పవన్ కుమార్,కార్యదర్శి సత్వావే సంతోష్ కుమార్ పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఈ గుర్తింపు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు? ప్రేరణగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# పద్మనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అడుగులు

◆అక్టోబర్ 17న నిర్మాణ పనులు ప్రారంభం

◆టీటీడీ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్

◆పది ఎకరాల విస్తీర్ణంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం.. తిరుమల ఆలయాన్ని తలపించేలా రూపకల్పన

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఆలయ నిర్మాణ పనులను ఈ నెల 17న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన టీటీడీ అధికారులతో కలిసి ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఆలయ నమూనాలు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు.



**కేసీఆర్ సహకారంతో టీటీడీ అనుమతులు**

కరీంనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి టీటీడీ అనుమతులు పొందినట్లు గంగుల కమలాకర్ వివరించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కవిరి భాస్కర్‌రావు, వినోద్‌కుమార్, దామోదర్‌రావులతో కలిసి తిరుమలకు వెళ్లి టీటీడీ అధికారులతో చర్చలు జరిపినట్లు గుర్తుచేశారు. వారి సహకారంతో ఆలయ నిర్మాణానికి అనుమతులు సాధించినట్లు పేర్కొన్నారు.

**టీటీడీ పేరిట పది ఎకరాల భూమి రిజిస్ట్రేషన్**

కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో ఆలయ నిర్మాణం కోసం పది ఎకరాల భూమిని టీటీడీ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు గంగుల కమలాకర్ తెలిపారు. భూమికి సంబంధించి వివిధ దశల్లో ఎదురైన అడ్డంకులను అధిగమించి ఆలయ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు. 2023 మే 31న ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించామని, ఆ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం కోసం మూలవిరాట్టుకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

**ఎన్నికలతో నిలిచిన పనులు .. ఇప్పుడు ముందడుగు**

భూమిపూజ అనంతరం ఆలయ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ, ఎన్నికల నేపథ్యంలో పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదని గంగుల కమలాకర్ వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ 17న మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం తొమ్మిది గంటలలోపు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.

**తిరుమల ఆలయాన్ని తలపించేలా రూపకల్పన**

పద్మనగర్‌లో నిర్మించనున్న ఆలయానికి సంబంధించిన నమూనాలు ఆకర్షణీయంగా రూపొందించినట్లు గంగుల కమలాకర్ తెలిపారు. తిరుమల ఆలయాన్ని తలపించేలా ప్రధాన ద్వారం ఉండటంతో పాటు గర్భాలయం, అర్ధమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ తదితర నిర్మాణాలతో ఆలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. సంప్రదాయబద్ధమైన నిర్మాణ శైలిలో స్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

**కరీంనగర్ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రం**

నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం చేపట్టడం సంతోషకరమైన విషయమని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే కరీంనగర్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత యాదవ సంఘం కమిటీల ఎన్నిక



**సుల్తానాబాద్,అక్టోబర్ 11(జనంసాక్షి) :** అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో రేగడి మద్దికుంట అల్లిపురం గ్రామాలలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమం లో అఖిల భారతీయ యాదవ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టావేన సది యాదవ్, సుల్తానాబాద్ మండల్ అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు అర్కుటి ఫకీర్ యాదవ్,పోలవేణి నరేష్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నల్లంగి సదయ్య ఉపాధ్యక్షులుగా ఆవుల శ్రీనివాస్ అట్ల కనకయ్య మారం మల్లయ్య యాదవ్,ప్రధాన కార్యదర్శి మారం రమేష్ కోశాధికారిగా కాల్వ శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులుగా,బద్ది రమేష్,నల్లంగి ఎల్లయ్య ,వేల్పుల కుమార్,మారం రాజయ్య,ఆవుల రమేష్,ఆవుల శ్రీనివాస్,సంకరి కుమారస్వామి,ఆవుల తిరుపతి,ఆవుల సతీష్‌లను ఎన్నుకున్నారు.

## మంచిరామి గ్రామంలోప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్ల సమస్యకు పరిష్కారం

### - సర్పంచ్ ఉప్పు లక్ష్మి చొరవతో 9.1 విద్యుత్ స్తంభం ఏర్పాటు



**సుల్తానాబాద్,అక్టోబర్ 11(జనంసాక్షి) :** మండలంలోని మంచిరామి గ్రామంలో బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్ల సమస్యకు సర్పంచ్ ఉప్పు లక్ష్మి చొరవతో పరిష్కారం లభించింది.బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ధాన్యం బస్తాలతో వెళ్లే హార్వెస్టర్ల రాకపోకలకు ఈ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ ఉప్పు లక్ష్మి విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించి, 9.1 విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించి వైర్ల సమస్యను పరిష్కరించారు.దీంతో ప్రమాదం జరిగే అవకాశం తగ్గడంతో పాటు గ్రామస్తులు, వాహన దారులకు ఇబ్బందులు తొలగాయి. సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన సర్పంచ్ ఉప్పు లక్ష్మితో పాటు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల జోగేందర్



**సుల్తానాబాద్,అక్టోబర్ 11 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నేత, కనుకుంట్ల జోగేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా, కనుకుంట్ల జోగేందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు గాను, కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్, జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని,దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ, మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని జెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విజయం సాధించిన పాలకవర్గ సభ్యులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



## శారీరక దృఢత్వంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**-బీఆర్ఎస్ నాయకురాలు,బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష**

**పెద్దపల్లి,అక్టోబర్ 11(జనంసాక్షి) :** యువత శారీరక దృఢత్వాన్ని అలవర్చుకుని క్రీడలతో పాటు కెరీర్‌లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ నాయకురాలు,బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చారు.జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ వాతావరణం నెలకొందని,ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమ నేత సి.సత్యనారాయణ రెడ్డి తో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నా, జీవితంలో సాధించాలన్నా శారీరక దారుఢ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.గత ఎన్నికల ప్రచార ఒత్తిడి వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు, నొప్పులు రావడంతో రెండు నెలల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సి వచ్చిందని,ఆ అనుభవంతోనే యువతలో ఆరోగ్యం,ఫిట్‌నెస్‌పై చైతన్యం తేవడానికి ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ను ప్రారంభించినట్లు తెలిపారు.స్థానిక యువతకు అత్యుత్తమ ప్రతిభ ఉందని,గతంలో నిర్వహించిన డేటా సైన్స్ శిక్షణ ద్వారా దాదాపు 120 మంది ప్రముఖ ఎంఎన్‌సీలలో లక్షల వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు.రాబోయే రోజుల్లో పెద్దపల్లిలో ఐటీ టవర్,టి-హబ్, మహిళల కోసం ప్రత్యేక ఉపాధి కల్పన పరిశ్రమలతో పాటు క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్,సుల్తానాబాద్ మినీ స్టేడియం ఆధునీకరణ వంటి సదుపాయాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ ఉద్యమ నాయకులు సి.సత్యనారాయణ రెడ్డి,బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్,నాయకులు పాడాల సతీష్,అడ్వకేట్ శ్రీధర్,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ప్రతినిధులు రాహుల్, హనీలతో పాటు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు,ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ రజక సంఘం అధ్యక్షునిగా నిట్టూరి మైసయ్య

### - మండలాధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ సమక్షంలో సమావేశం

**సుల్తానాబాద్,అక్టోబర్ 11(జనంసాక్షి) :** సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ రజక సంఘం నేత నిట్టూరి మైసయ్యను పట్టణ రజక సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండలాధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలో రజక సంఘం నూతన కమిటీ సమావేశం ఏర్పాటు చేయగా,కమిటీ సభ్యులందరూ రజక సంఘం కమిటీ నిట్టూరి మైసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా నిట్టూరి అంజయ్య,నిట్టూరి దీపక్,కోశాధికారిగా కొత్తకొండ శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా తోటపల్లి సంతోష్,గౌరవ అధ్యక్షులుగా నిట్టూరి రాజేశం,ముఖ్య సలహాదారుగా నిట్టూరి కృష్ణ,ప్రచార కార్యదర్శిగా చాతల శివ,కార్యవర్గ సభ్యులుగా,నిట్టూరి కనకయ్య,బూత్కూరి శంకర్ లను ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండలాధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ హాజరై, నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రజక బంధువులందరూ ఐక్యంగా ఉండాలి. మన సంఘం బలోపేతం కావాలని,పేద రజక కుటుంబాలకు ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలు,రుణాలు,చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు, ధోబీఘాట్ల ఆధునీకరణ కోసం మనమందరం కలిసి పోరాడాలని సూచించారు. నూతన కమిటీకి నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రజక సంఘం అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలకు, విద్యార్థుల చదువులకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం పెద్దలు,యువ నాయకులు,సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్జును,సది,సామి, రాజయ్య,రవీందర్,సంపత్,శంకర్,రాజేశం,పాల్గొన్నారు.





## జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

**గంభీరావుపేట, అక్టోబర్ 11 (జనం సాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, రాజారాం, కొమిరిశెట్టి లక్ష్మణ్, వేణుగోపాల్, బండ రమేష్, ఐలేని నర్సింగారావుతో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఉషు పోటీలకు సాయి కృష్ణ ఎంపిక

**గంభీరావుపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):**



గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బి. సాయి కృష్ణ జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యాడు.జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత పొందాడు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం సాధించి ప్రతిభ చాటాడు.ఈ నెల 14 నుంచి 18 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నాడు.సాయి కృష్ణ విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థి ప్రతిభను డీవైఎస్ఓ అజ్మీరా రాందాస్ అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, పీఈటీ బాను ప్రత్యేకంగా ప్రశంసించారు.క్రీడల్లో మరింత రాణించి పతకాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.గ్రామీణ విద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ ఉందని సాయి కృష్ణ నిరూపించాడన్నారు. జాతీయ స్థాయిలోనూ విజయం సాధించి గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు.

## గన్నేరువరంలో ఘనంగా పదవ వార్షికోత్సవ సంబరాలు

### యువజన సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన నాయకులు

**గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి):**
గన్నేరువరం గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో పదవ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు గన్నేరువరం యువజన సంఘం నాయకులు సందవేణి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సందవేణి ప్రశాంత్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా యువజన సంఘం గ్రామ అభివృద్ధికి, యువత చైతన్యానికి కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు న్యాత సుధాకర్,కాంతాల అంజి రెడ్డి, మిసాల ప్రభాకర్, బుర్ర తిరుపతి, బూర శ్రీనివాస్,తెల్ల సంతోష్, సమ్మెట అనిల్, గ్రామ యువకులు, పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బోయినపల్లి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చల్ల శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక.. రెండేళ్ల పాటు పదవీకాలం

**బోయినపల్లి అక్టోబర్ 11 (జనంసాక్షి)**



మండల రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో రెండేళ్ల పదవీకాలానికి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నిమ్మ వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. బోయినపల్లి మండలంలో రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు చేయాలన్న ఎన్నో ఏళ్ల కల నెరవేరిందన్నారు. రెడ్డి కుల సంక్షేమమే ధ్యేయంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కులంలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి కృషి చేయాలనే ఉద్దేశంతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**
అధ్యక్షుడు: చల్ల శ్రీనివాసరెడ్డి
ఉపాధ్యక్షులు: గుడి శ్రీనివాసరెడ్డి, ముచ్చ శ్రీనివాసరెడ్డి, మానేరు లక్ష్మారెడ్డి, ముచ్చ శేఖర్‌రెడ్డి,కార్యదర్శి: మిట్టపల్లి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులు: పాశం నారాయణరెడ్డి, కంకణాల పురుషోత్తంరెడ్డి, ధ్యావ నరేందర్‌రెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి,కోశాధికారి: డబ్బు వెంకట్‌రెడ్డి, అనంతరం నూతన అధ్యక్షుడు చల్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘ అభివృద్ధికి, రెడ్డి కులస్తుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల సంఘంపై ఎంపీ వంశీకృష్ణ నిరాధార ఆరోపణలు

### -ఓటమి భయంతోనే ఓట్ల చోరీ నాటకం

### -బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం



**పెద్దపల్లి,అక్టోబర్ 11(జనంసాక్షి) :**
కేంద్ర ఎన్నికల సంఘంపై,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న నిరాధార వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలను తీవ్రంగా కించపరిచేలా ఉన్నాయని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం మండిపడ్డారు.జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లె సదానంద మాట్లాడుతూ మహారాష్ట్ర,హర్యానా ఎన్నికల ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు ఈవీఎంలు,రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు.ఢిల్లీ వేదికగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతున్న 13 కోట్ల ఓట్ల చోరీ ఆరోపణలకు ఒక్క ఆధారమైనా చూపించగలరా అని సూటిగా ప్రశ్నించారు.పెద్దపల్లి ఎంపీగా గెలిచి 16 నెలలు గడిచినా నియోజకవర్గానికి నయాపైసా తీసుకురాలేదని,రామగుండం ఎరువుల కర్మాగారం,ఎన్టీపీసీ,రైల్వే లైన్ డబ్లింగ్,నేషనల్ హైవే 363 వంటి అభివృద్ధి పనులన్నీ మోదీ ప్రభుత్వ నిధులతోనే సాధ్యమయ్యాయని స్పష్టం చేస్తూ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.రాముడిని కల్పిత పాత్రగా కోర్టులో అఫిడవిట్ ఇచ్చిన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాముడి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని,కాకా కుటుంబం పేరు చెప్పుకుని గెలిచిన వంశీకృష్ణ సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు.స్థానిక సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీలో రాహుల్ గాంధీ మెప్పు,ఫోటోల కోసమే సమయం వెచ్చిస్తున్న ఎంపీ వెంటనే ఎన్నికల సంఘానికి,సీఈసీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోర మనోహర్,పెండ్యాల కుమార్,సంపత్ చారి,కోల సుధాకర్,ముస్తాల సంతోష్,బండ కరుణాకర్,తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో ఘనంగా నవదుర్గ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**మల్లాపూర్.అక్టోబర్ 11,(జనంసాక్షి)**
మల్లాపూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన నవదుర్గ సమితి ఆధ్వర్యంలో దుర్గ మాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని నంది చౌరస్తా నుండి పాత బస్టాండ్ భరతమాత విగ్రహం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు, అన్ని కులాల పెద్ద మనుషులు, యువకులు, మాల స్వీకరించిన మాలదారులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుమారు 100 మంది భక్తులు కంకణధారణ చేసి అమ్మవారి మాల స్వీకరించారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో జరిగే ఈ ఉత్సవాల్లో బుధవారం బోనాలు, గురువారం మహా అన్నదానం, శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు నవదుర్గ సేవాసమితి సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని, దాతలు ఎవరైనా ఉంటే ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## నూతన ఎస్.వి సూపర్ మార్కెట్ ప్రారంభించిన ప్రభుత్వ విప్



**కథలాపూర్ అక్టోబర్ 11 (జనంసాక్షి )**
కథలాపూర్ మండల కేంద్రంలోని నూతనంగా ఎస్ వి సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు మండల కేంద్రంలోని సర్పంచులు ఉపసర్పంచులు ప్యాక్స్ చైర్మన్ డైరెక్టర్ ఎస్ వి సూపర్ మార్కెట్ బంధుమిత్రులు పాల్గొనడం జరిగింది.

## లక్ష్మీ నర్సింహ స్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ లక్ష 96వేలు

**ఎడపల్లి, అక్టోబర్ 11 ( జనంసాక్షి ) :**
శనివారం అమావాస్యను పురస్కరించుకొని ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహ దేవస్థాన హుండీ ఆదాయం లక్ష 96 వేల 613 రూపాయలు వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిలుక రవికుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు ఆదివారం తెలిపారు. టికెట్ల ద్వారా రూ24,400, బహిరంగ వేళముల ద్వారా రూ 1,12,100-00 మరియు హుండీ ద్వారా రూ60,113-00 మొత్తం ఆదాయము రూ1,96613-00 లు వచ్చాయని కార్యనిర్వాహణాధికారి గింజుపల్లి వేణు తెలిపారు
ఈ కార్యక్రమాలలో దేవదాయ శాఖ పరిశీలకురాలు ఆర్.సుజాత రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చిలుక రవి, ధర్మకర్తలు నర్సారెడ్డి, మోహన్, సంజయ్, గంగాధర్, రాజు మరియు అర్చకులు శ్రీ రంగం కొండమాచార్యులు డిప్యుటేషన్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

